
సాక్షి ఒడిశా
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,12,198లు, బంగారం 6గ్రాము 100 మిల్లీగ్రాములు వెండి 9 గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

గజపతి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన పలు నృత్య రూపకాలు అబ్బురపరిచాయి.

- 8లో



ఒడిస్సీ ఉత్సవ్ ప్రారంభం

విశ్వ ఒడిస్సీ ఉత్సవ్-2024 సోమవారం ప్రారంభమైంది. ఒడిస్సీ ఇంటర్నేషనల్ ఫోరమ్, సాంస్కృతిక కల్చరల్ సొసైటీ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

ఉన్నత విద్యకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి పవిత్ర మండల్

పర్లాకిమిడి: ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్వపరిపాలన వారోత్సవాలు, గుడ్ గవర్నెన్స్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ఏడీఎం రాజేంద్ర మింజ్ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి పవిత్ర మండల్, డీఆర్‌డీఏ అదనపు కార్యనిర్వాహణాధికారి పృథ్వీరాజ్ మండల్, జిల్లా ముఖ్య విద్యాధికారి మయాధర్ స్వయిని పాల్గొన్నారు. వర్క్‌షాపులో ఉన్నత విద్య, ఆరోగ్యం, శిశువికాస్, గ్రామీణ స్థాయిలో సాధారణ వినతుల పరిష్కారంపై అధికారులు చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం మేరకు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకూ అన్ని మండలాలు, గ్రామపంచాయతీ స్థాయిలో గుడ్ గవర్నెన్స్ వారోత్సవాలు జరుగుతున్నాయని ఏడీఎం రాజేంద్ర మింజ్ అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు డిప్యూటీ కలెక్టర్ లిపినా దాస్, కమలకాంత పండా, కష్యప్ బెహరా పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయకపోతే 26న బంద్

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: కొరాపుట్ జిల్లాలో ఈ నెల 25వ తేదీలోగా మండీలలో ధాన్యం కొనుగోలు చేయకపోతే 26వ తేదీన జిల్లా బంద్ చేస్తామని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి హెచ్చరించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను అధికార బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పౌరసరఫరాల మంత్రి ఇటీవల జయపురంలో పర్యటించిన సందర్భంగా మండీలలో ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవకతవకలకు తావు ఉండదని, రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని..అయితే క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. ఇచ్చిన హామీని నేరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఇప్పటికే రైతులు ధాన్యాన్ని మండీలకు తీసుకువచ్చారని వెల్లడించారు. అకాల వర్షాలు, పొగ మంచు కారణంగా ధాన్యంపై కప్పేందుకు టార్పాలిన్లను సైతం కొనుగోలు చేయలేని దుస్థితిలో రైతులు ఉన్నారన్నారు. ప్రభుత్వం రైతులకు కేవలం టోకెన్లను ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. టోకెన్ల కాల గడువు కేవలం ఒక నెల కావటంతో పాలకులు ఎప్పుడు ధాన్యం కొంటారో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారో ప్రభుత్వం ప్రకటించాలని ఎమ్మెల్యే బాహిణీపతి డిమాండ్ చేశారు. ఎటువంటి నిబంధనలు లేకుండా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు భవాణీ శంకర రత్, జయపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బసంత నాయక్, రైతు ఉగ్రసేన్ మండల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

మల్కన్‌గిరి: రోడ్డు ప్రమాదంలో వివాహిత ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి కుమార్‌గూఢ గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందగూడ గ్రామానికి చెందిన రామే బేటీ తన భార్య షింగే బేటీ(33)తో కలిసి ద్విచక్ర వాహనంపై పోడియ గ్రామానికి సామాన్ల కొనుగోలు కోసం వచ్చారు. రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో తిరిగి వెళ్తుండగా అజాయ్ కరామ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి రామే బేటీ వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో షింగే బేటీ రోడ్డుపై ఉన్న రాయిపై పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. అటుగా వెళ్తున్నవారు పోడియ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని షింగే బేటీని పోడియ ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రమాదానికి కారణకునిగా భావిస్తున్న అజాయ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.



బాగుసల గ్రామం వద్ద బురదలోనే ధాన్యం



కళ్లాల్లో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

చివరికిలా..!

- ఎడతెరిపి లేని వర్షాలతో కోలుకోలేని రైతులకు కోలుకోలేని దెబ్బ
- ధాన్యం ఎండబెట్టేందుకు తప్పని పాట్లు
- తాజాగా అల్పపీడనం హెచ్చరికలతో ఆందోళన

పర్లాకిమిడి : అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. పశ్చిమ కేంద్ర బంగాళాఖాతంలో ఈ నెల 24న మరో అల్పపీడనం ఏర్పడే సూచన లున్నాయని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐ.ఎం.డి.) అధికారి ఉమాకాంత దాస్ ప్రకటిస్తూ గజపతి జిల్లాకు ఎల్లో వార్నింగ్ జారీ చేశారు. దీంతో గుసాని, గుమ్మా, కాశీనగర్ తదితర ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అగరఖండి, కత్తల కవిటి, కోర్సండ గ్రామస్తులు ఇటీవల కలెక్టరేట్‌కు చేరుకుని మండీలను వెంటనే తెరిచి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. చాలా గ్రామాల్లో ధాన్యం నిల్వచేయడానికి సౌకర్యం లేనందున ఆరబయటే ఎండబెట్టిడుతున్నారు. డిసెంబరు 19, 20, 21న వరుస వర్షాలతో కోసిన వరిపంట ఇంకా పొలాల్లోనే ఉంది. ఎండ లేనందున తడిసిన ధాన్యాన్ని రోడ్డుపైకి తెచ్చి ఆరబెడుతున్నారు. ఉప్పలాడ, లింగుపురం గురండి, గుసాని రోడ్డులో సోమవారం ఇలా రహదారులపై ధాన్యం ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరోవైపు ప్రభుత్వం ఈ నెల 30 నుంచి మండీ ప్రారంభిస్తామని ఆర్.ఎం.సి.సెక్రటరీ ద్వారా ప్రకటించిందని, వెంటనే కొనుగోలు ప్రారంభించాలని బీజేపీ కృషి మోర్చా అధ్యక్షుడు ప్రశాంతకుమార్ పాలో డిమాండ్ చేశారు. మబ్బులు, వర్షాలతో రైతులకు కోలుకోని దెబ్బ తగిలిందని, ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో రైతుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ పట్నాయిక్ కోరారు.



ఇంటికి తెచ్చుకుని రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్న దృశ్యం



గురండి- గుసాని రోడ్డులో పంట పొలాల్లోనే ధాన్యం



ఉప్పలాడ, లింగుపురం, గురండి రోడ్డులో రోడ్డుపై ఇలా..



కళ్లాల్లోని ధాన్యాన్ని ఇంటికి తీసుకువెళుతున్న కూలీలు


రాయగడ చైతీకి రంగం సిద్ధం



పట్టణంలో ఏర్పాటు చేసిన చైతీ ప్రవేశ ద్వారం

రాయగడ:

స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న జిల్లా స్థాయి చైతీ ఉత్సవాలకు రాయగడ పట్టణం ముస్తాబవుతోంది. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు ప్రబాతి పారిడ, కనకవర్ధన్ సింగ్ దేవ్, మంత్రులు నిత్యానంద గొండ, సురేష్ పూజారి తదితరులు ఉత్సవాలకు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాల మైదానంలో 376 స్టాల్స్ ఏర్పాటుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. శాంతిభద్రతలను పరివేక్షించేందుకు పోలీసులు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి వేదికను ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టేలా రూపుదిద్దుకుంటోంది.



వేదిక నమూనా

ఎల్ఈడీ వెలుగులకు బదులు స్థానిక కళాకారులతో ప్రత్యేకంగా కుడ్య చిత్రాలు వేయిస్తున్నారు.



చిత్రాలు వేస్తున్న కళాకారుడు



గోడలపై ఆదివాసీ చిత్రాలు



సిద్ధమవుతున్న పోలీస్ కంట్రోల్ రూం

గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలను తగలబెడుతున్న సిబ్బంది

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి నిధిగుడి ప్రాంతంలో గంజాయి సాగును పోలీసులు, అబ్కారీ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ధ్వంసం చేశారు. ఆదివారం జరిగిన ఈ దాడుల్లో సుమారు ఏడు ఎకరాల విస్తీర్ణంలో 21 వేల గంజాయి మొక్కలు తొలగించి వాటిని తగలబెట్టారు.

అగ్నిమాపక సిబ్బందికి ఆధునిక పరికరాలు



రోబోటిక్ ఫైర్ ఫైటింగ్ వాహనం



ఫైర్ కంట్రోలింగ్ బుల్లెట్

రాయగడ : అగ్ని ప్రమాదాల సమయంలో మంటలను త్వరితగతిన నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక సిబ్బందికి ఆధునిక యంత్రాలను సమకూర్చింది. దీనిలో భాగంగా రోబోటిక్ ఫైర్ ఫైటింగ్ ఇంజిన్, ఫైర్ కంట్రోలింగ్ బుల్లెట్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోబోటిక్ ఫైర్ ఫైటింగ్ ఇంజిన్ సహాయంతో తక్కువ సమయంలో మంటలను అదుపు చేయవచ్చు. ఎక్కువ మంది సిబ్బంది అవసరం లేకుండా రిమోట్ కంట్రోల్ సాయంతో దీనిని ఆపరేటింగ్ చేయవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి రమేష్ చంద్ర బెహరా తెలిపారు.ఈ నెల 26నముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాయగడ పర్యటన సందర్భంగా ఈ వాహనాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

ముగిసిన ఇడితాల్ ఉత్సవాలు

- ప్రముఖులకు సన్మానం

రాయగడ:

జిల్లాలోని గుణుపూర్‌లో ఇడితాల్ పేరిట మూడు రోజులు జరిగిన చైతీ సమితి స్థాయి ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో రాయగడ, గుణుపూర్, బిసంకటక్ ఎమ్మెల్యేలు అప్పలస్వామి కడ్రక, సత్యజీత్ గొమాంగో, నీలమాధవ హికక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, గుణుపూర్ మున్సిపల్ చైర్మన్ మమత గౌతో తదితరులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. సీనియర్ పాత్రికేయుడు దేవీ ప్రసాద్ చౌధరి, ప్రముఖ సమాజ సేవకులు, బాలనికేతన్ అనాథ ఆశ్రమ వ్యవస్థాపకులు బంధానిధి మహాంతి సన్మానం పొందినవారిలో ఉన్నారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ చంద్ర ధ్వజ పండ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.



సత్కారం అందుకుంటున్న ప్రముఖులు



పాత్రికేయుడు చౌదరిని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు



బంచానిధిని సన్మానిస్తున్న దృశ్యం



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

క్లుప్తంగా

పంట నష్టాన్ని అంచనా వేయండి

- కలెక్టర్లకు రెవెన్యూశాఖ మంత్రి ఆదేశాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతాంగం అభ్యర్థిస్తుంది. ఈ వర్గం అభ్యర్థనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అకాల వర్షాలతో ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం సమీక్షించి రైతాంగానికి సముచిత సాయం అందజేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి ప్రభావిత జిల్లా కలెక్టర్లకు తదనంతర ఉత్తర్వులు జారీ చేశారు.

క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సమీక్షించి రైతాంగానికి సముచితంగా పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనాకు అనుకూలత నెలకొని ఉంది. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా అకాల వర్షాలతో ప్రభావం కాని ప్రాంతాల నుంచి రెవెన్యూ విభాగం సిబ్బంది తహసీల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అమీన్లు ప్రభావిత ప్రాంతాలు సందర్శించి క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనా కార్యకలాపాల్లో పాలుపంచుకోవాలని మంత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నివేదిక ఆధారంగా సముచిత సాయం సకాలంలో మంజూరు చేస్తామని బాధిత రైతాంగానికి రెవెన్యూ మంత్రి సురేష్ కుమార్ పూజారి హామీ ఇచ్చారు. త్వరలో పంటలను నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించనున్నటుట మంత్రి వెల్లడించారు.

బీమా వర్తింపు

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (ఖరీఫ్ - 2024) కింద బీమా నమోదు చేసుకున్న రైతాంగానికి నిబంధనల మేరకు పరిహారం లభిస్తుంది. ఈ మేరకు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు మంత్రి సూచించారు.

పలు జిల్లాలు ప్రభావితం

అకాల వర్షాలతో పలు జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఈ జాబితాలో అంగుల్, బాలాసోర్, భద్రక్, బౌద్, కటక్, ఢెంకనాల్, దేవ్‌గఢ్, గజపతి, గంజాం, జగత్‌సింగ్‌పూర్, జాజ్‌పూర్, కంధమల్, కేంద్రాపడా, కెంజొహర్, ఖుర్దా, కొరాపుట్, మయూర్‌భంజ్, నవరంగపూర్, పూరీ, రాయగడ జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల నుంచి సుమారు 15 లక్షల మంది రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఖాతాదారులుగా ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పంట నష్టం నివేదిక దాఖలుతో బీమా పరిహారం కోసం వెసులుబాటు కల్పించడంలో యంత్రాంగం సహకరిస్తుందన్నారు. కృషి రక్షక్ యాప్ ఆధ్వర్యంలో పంట నష్టం వివరాలు దాఖలు చేసిన 72 గంటల్లో తగిన పరిహారం లభిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. అనుబంధ సమాచారం, సహాయం కోసం టోల్ ఫ్రీ నంబరు 14447 డయల్ చేయాలని సూచించారు.

ఈవీఎం ఓట్ల వ్యత్యాసాలపై ఫిర్యాదు

భువనేశ్వర్: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో పోలైన ఓట్లు, లెక్కింపులో భారీ వ్యత్యాసం చోటు చేసుకుందని, ఈ అవకతవకల్ని లోతుగా పరిశీలించాలని బిజూ జనతా దళ్ ప్రతినిధి బృందం భారత ఎన్నికల కమిషన్‌కు విన్నవించారు. ఈ మేరకు మాజీ పార్లమెంట్ సభ్యుడు అమర్ పట్నాయక్ ఆధ్వర్యంలో బీజేడీ ప్రతినిధి బృందం ఈసీఐకి వినతిపత్రం సమర్పించింది.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



మాట్లాడుతున్న ప్రకాశ్ చంద్ర పట్నాయక్

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత విజ్ఞాని శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవ కార్యక్రమానికి హెచ్‌ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పట్నాయక్ విద్యలో గణితం ప్రాధాన్యతను ప్రసంగించారు. విద్యార్థులకు గణితంపై క్విజ్ పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయుడు దుర్గా ప్రసాద్ పాత్రో, దేవేంద్ర పాడీ, అరుందతి త్రిపాఠీ పర్యవేక్షించారు. ప్రభాతీ పాణిగ్రాహి, పాపతీ ప్రధాన్, ఆద్యశక్తి పండా, నమిత బరాల్, కె.ప్రమీల, సుధా పట్నాయక్, సువర్ణ ఖీలో, సుచరిత పట్నాయక్, బాలగోపాల మిశ్ర, నాగేశ్వరరావు, గణిత క్విజ్ ను నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులతోపాటు విక్రమదేవ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.



జగన్నాథ ఒడిస్సీ కళాకేంద్రం నృత్యం ప్రదర్శన



గీతాలు ఆలపిస్తున్న ఎస్పీ జి.ఎస్.పండా

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ముగిసిన గజపతి ఉత్సవాలు
- మహారాజా కృష్ణచంద్రగజపతి కృషి ఫలితమే స్వతంత్ర ఒడిషా రాష్ట్రం: కలెక్టర్



తహశీల్దారు, బీడీఓలను సత్కరిస్తున్న కలెక్టర్ దాస్



ఉత్సవాలను తిలకిస్తున్న కలెక్టర్ దంపతులు, పక్కన ఎస్పీ పండా

పర్లాకిమిడి: స్వతంత్ర ఒడిశా కోసం పోరాడి సాధించిన పర్లాకిమిడి మహారాజా దివంగత కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్ చిరస్మరణీయులని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన గజపతి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన పర్లాకిమిడి తహశీల్దారు నారాయణ బెహరా, ఆర్.ఉదయగిరి, గుసాని బీడీఓలను కలెక్టర్ దుశ్శాలువతో సత్కరించారు. వివిధ కమిటీల సభ్యులకు జ్ఞాపికలు బహుకరించారు. జగన్నాథ ఒడిస్సీ కళా కేంద్రం ఆధ్వర్యంలో డి.ప్రియాంక నేతృత్వంలో జరిగిన ఒడిస్సీ నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎస్పీ జితేంద్ర పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, డి.ఆర్.డి.ఎ. సీడీఎం గుణనిధి నాయక్, ఐ.టి.డి.ఎ. అధికారి అంశుమాన్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనూప్ పండా తదితరులు పాల్గొన్నారు.



జానపద నృత్యంలో కళాకారులు



పదమ్మిత నృత్యాయన కళాకారులు లోకనృత్యం ప్రదర్శన



ఆవు, పులి నాట్య రూపకం



కళింగ వైశ్య సంఘం సభ్యుల దాండియా నృత్యం

లోకాయుక్తను సవరించాలి



మాట్లాడుతున్న సుబ్రత్ కుమార్ నందో

జయపురం: రాష్ట్రంలో అవినీతిని అంతమొందించేందుకు లోకాయుక్త చట్టాన్ని వెంటనే సవరించాలని అఖిల భారత భ్రష్టాచార విరోధీ సంఘటన ఒడిశా రాష్ట కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం 26వ జాతీయ రహదారి సదర్ పోలీసు స్టేషన్ ప్రాంతంలో గల ఒక హోటల్‌లో రాష్ట్ర కమిటీ నిర్వహించిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది, అఖిల భారత్ భ్రష్టాచార విరోధ సంఘటన ఆర్గనైజర్ సుబ్రత్ కుమార్ నందో మాట్లాడారు. గత 24 ఏళ్లుగా రాష్ట్రంలో అన్ని రంగాలలోనూ అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. పెద్ద ఎత్తున జరుగుతున్న అవినీతిపై చర్యలు చేపట్టేందుకు విజిలెన్స్ వద్ద తగినంత సిబ్బంది లేరన్నారు. ఇతర రాష్ట్రాలలో స్వతంత్ర లోకాయుక్త ఉండటంవలన అవినీతి చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. అటువంటి పరిస్థితులు మన రాష్ట్రంలో ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న అవినీతి, చీకటి పనులను అరికట్టేందుకు లోకాయుక్తకు అధికారం అత్యవసరమన్నారు. దేశంలోనే ఒడిశా అవినీతిలో అగ్రగామిగా ఉందని విజిలెన్స్ రిపోర్టులు వెల్లడిస్తున్నాయన్నారు. అవినీతిని అంతమొందించేందుకు ఇతర రాష్ట్రాల్లోని చట్టాలను తర్జుమా చేసి కొత్త ప్రభుత్వం అవగాహన చేసుకోనేందుకు జనవరిలో రాష్ట్ర భ్రష్టాచార విరోధి సంఘటన సచేతన కార్యక్రమాలతోపాటు, సంతకాల సేకరణ చేపట్టనున్నదని వెల్లడించారు. గత ఎడాది నవరంగపూర్ జిల్లాను అవినీతి విముక్తి జిల్లాగా మార్చేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టటం జరిగిందని, విజిలెన్స్ విభాగం ద్వారా సబ్‌కలెక్టర్ నుంచి జిల్లా ప్రాథమిక విద్యాధికారి దుర్నీతి, కార్యకలాపాలను ప్రజల ముందు ఉంచటం జరిగిందని ఉదహరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అవినీతి సంఘటనలు సేకరించేందుకు ప్రైవేట్‌గా అభియోగ శిబిరాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఆ శిబిరాలలో సేకరించిన అవినీతి ఆరోపణలను గత ప్రభుత్వానికి సమర్పించి దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. నవరంగపూర్‌లో మండీలలో దుర్నీతి, ఎరువుల పంపిణీలో అక్రమాలు, స్కూలు యూనిఫాంలలో దుర్నీతిని ప్రజల ముందు ఉంచేందుకు భ్రష్టాచార విరోధి సంఘటన పలు కార్యక్రమాలు నిర్వహించిందని వివరించారు. ప్రభుత్వం మారినా అవినీతి యధాతథంగా కొనసాగుతుందని, వివిధ ప్రభుత్వ పథకాలకు వస్తున్న నిధులు దారి మల్లుతున్నాయని ఆరోపించారు.

సీనియర్ న్యాయవాది కొరాపుట్ జిల్లా ఉద్యోగులు అశోక్ మిశ్ర, నవరంగపూర్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర రావు, సాధారణ కార్యదర్శి ఆదివాసీ నేత అర్జున ఖొత్ర, బొరిగుమ్మ సమితి సంఘటన అధ్యక్షుడు రవిశంకర మహాపాత్రో, జయపురం పట్టణ సంఘటన అధ్యక్షుడు పూర్ణచంద్ర పాడీ, జయపురం బ్లాక్ సంఘటన అధ్యక్షుడు నర్సింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల నిర్వహణలో నిర్లక్ష్యం



పంచాయతీ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి నీలాపూర్‌లో జలసంపద శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాగునీటి సంఘాల పక్షోత్సవాలు సోమవారం నిర్వహించారు. పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాశీనగర్, గుసాని సమితిల్లో సాగునీటి సంఘాల పాయింట్ల నిర్వాహణలో అనేక లోపాలు, నిర్లక్ష్యధోరణి అధికారుల్లో కనిపిస్తోందని విమర్శించారు. పాణి పంచాయతీల పక్షోత్సవాలు నేపథ్యంలోమట్టి, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. ఇరిగేషన్ ఇంజనీర్ మహారాణా మాట్లాడుతూ కృష్ణసాగరం కుడి, ఎడమ గేట్లు పరిశీలించామని, త్వరలోనే పూడిక తీత పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అంతకుముందు కలెక్టరేట్ వద్ద పాణి పంచాయతీల పక్షోత్సవాల ప్రచార రథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, గుసాని సమితి అధ్యక్షులు ఎన్.వీర్రాజు, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, గుమ్మ బ్లాక్ చైర్మన్ సునేమి మండళ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



నీలాపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ పాలో

విశ్వ ఒడిస్సీ ఉత్సవ్- 2024 ప్రారంభం



విశ్వ ఒడిస్సీ ఉత్సవ్ - 2024లో బృంద నృత్య ప్రదర్శన



యుగళ నృత్య ప్రదర్శన



సోలో నృత్య ప్రదర్శన

భువనేశ్వర్: పదిహేనవ వార్షిక విశ్వ ఒడిస్సీ ఉత్సవ్-2024 సోమవారం ప్రారంభమైంది. ఒడిస్సీ ఇంటర్నేషనల్ ఫోరమ్, సాంస్కృతిక కల్చరల్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో దేశ, విదేశాల నుంచి దాదాపు 300 మంది ఒడిస్సీ నృత్యకారులు పాల్గొంటున్నారు. ఈ నెల 26 వరకు స్థానిక భంజ కళా మండప్‌లో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు కళా ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. తొలి రోజు కార్యక్రమంలో భువనేశ్వర్‌కు చెందిన చిన్నారి ఆదిత్రి బెహెరా, శ్రియాశ్రీ మహాపాత్రో సోలో నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జీకేసీఎమ్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సికతా దాస్, ప్రముఖ మర్దల వాద్యకారుడు ధనేశ్వర్ స్వంయి, ఒడిస్సీ నృత్య కళాకారులు సుజాత మహాపాత్రా, జ్యోతి రౌత్, దేవజానీ సేన్ అతిథులుగా పాల్గొన్నారు. సీనియర్ పాత్రికేయుడు శ్యామహరి చక్ర రూపకల్పనలో ఈ ఉత్సవం ఏటా క్రమం తప్పకుండా నిర్వహించడం పట్ల కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

దుకాణంలోనికి దూసుకుపోయిన కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు
- శునకం మృతి



ప్రమాదంలో గాయపడిన క్షతగ్రాత్రుడు



నుజ్జయిన కారు



తీవ్రంగా గాయపడిన దనపతి ఉద్దవ దొరా పుటియ

జయపురం: కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టీ దుకాణంలోనికి దూసుకుపోయింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. శునకం చనిపోయింది. ఈ సంఘటన బొయిపరిగుడ సమితి మతపాడ గ్రామ పంచాయతీ టిపాగుడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బరంపురం నుంచి ఏడుగురు వ్యక్తులు కారులో బోయిపరిగుడ సమితిలో ఉన్న ప్రసిద్ధ శివ క్షేత్రం గుప్తేశ్వర్ వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి టిపాగుడ గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న దుకాణంలోనికి దూసుకు పోయింది. దీంతో అక్కడ ఉన్న ఓ ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. అక్కడ ఉన్న శునకంపైకి కారు వెళ్లడంతో ప్రాణాలు కోల్పోయింది. కారులో ఉన్న ముగ్గరు గాయపడ్డారు. గాయపడిన వారిలో టిపాకుడ గ్రామానికి చెందిన సురేంద్రకమడి, ధనపతి భైరాపుటియ, దొరాగుడ పంచాయతీ మఝిగుడ గ్రామానికి చెందిన ఉర్ధవ దొరాపుటియ ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో సురేంద్రకమడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జయపురం ఫూల్‌బెడలో గల జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రమాద స్థలాన్ని బొయిపరిగుడ, రామగిరి పోలీసులు సందర్శించారు. కారును సీజ్ చేసి డ్రైవర్ అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు



ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ అంబాగుత గోపబంధు ప్రభుత్వ ఐటీఐ లో గత మూడు రోజులు జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమాకాంత పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఫెస్ట్ ముగింపు ఉత్సవంలో ముఖ్యఅతిథిగా రావణగుడ ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. అంబోగుడలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు జరగడం ఆనందంగా ఉందన్నారు. క్రీడా పోటీల్లో గెలుపోటములు సమానమన్నారు. ఓటమి చెందినవారు నిరుత్సాహానికి గురికాకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. గౌరవ అతిథులుగా కొరాపుట్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సుబేందు మిశ్ర హాజరయ్యారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలోని 14 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల నుంచి విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉత్తమ క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో జరుగనున్న ఫెస్ట్ పోటీలకు పంపనున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాకాంత పట్నాయక్ వెల్లడించారు. అంబాగుడ ఐటీఐ శిక్షకులు పరమానంద గౌడ, రాకేష్ మిశ్ర, సంతోష్ కుమార్ పాత్రో, హరప్రసాద్ మల్లిక్, చంద్రానంద బెహర, శరత్ గంతాయిత్, సతీష్ కుమార్, అర్జున మండల్, సునీల్ కుమార్, రెజమా బీబి, రూపేష్ మహంతి క్రీడా పోటీలను పర్యవేక్షించారు.

ఫరెవర్ మిస్ టీన్ ఇండియా 2024

రన్నరప్‌గా సోనాక్షి మహాపాత్రో

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాకు చెందిన బాలిక సోనాక్షి మహాపాత్రో (13) రాజస్థాన్ జైపూర్‌లోని జి-స్టూడియోలో జరిగిన ఫరెవర్ మిస్ టీన్ ఇండియా 2024లో రన్నరప్ టైటిల్ గెలుచుకుంది. 30 దేశాలకు చెందిన 70 మంది బాలికలు పోటీల్లో పాల్గొనగా.. అందరికంటే చిన్నవయసుగల సోనాక్షి మల్కన్‌గిరిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది.



అతిథితో సోనాక్షి మహాపాత్రో



తోటిపోటీదారులతో సోనాక్షి

కలెక్టర్‌కు వినతుల వెల్లువ



కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న గిరిజనులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి కార్యాలయం వద్ద సోమవారం కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. పరిసర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున హాజరై సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తాగు నీరు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు తదితర సమస్యలపై 37 వినతులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా అదనపు ఎస్పీ తపన్ నారాయణ్ రోతో తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి కుములి స్టేడియంలో లక్ష్మణ బాలాజీ క్రికెట్ క్లబ్ సోమవారం ప్రముఖ క్రీడాకారుడు స్వర్గీయ శివప్రసాద్ బాహిణీపతి జ్ఞాపకార్థం శివప్రసాద్ మెమోరియల్ టి-20 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

ముందుగా లక్ష్మణ బాలాజీ మందిరంలో పూజలు చేశారు. క్రికెట్ క్లబ్ చైర్మన్ సుశాంత కుమార్‌హోత్త నేతృత్వం నిర్వహించిన ఈ పోటీల్లో కొరాపుట్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధా బినోద్ సామంతరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గౌరవ అతిథిగా బొరిగుమ్మ క్లబ్ అధ్యక్షుడు రాధాకాంత సామంతరాయ్, ముఖ్యవక్తగా సమాజ సేవకుడు, బీజేడీ నేత సురేంద్ర కుమార్ త్రిపాఠీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ప్రారంభ పోటీ జయపురం ఈవినింగ్ క్లబ్ టీమ్, హనుమాన్ స్పోర్టింగ్ కొరాపుట్ టీమ్‌ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన జయపురం జట్టు 20 ఓవర్లలో 244 పరుగులు చేసి ఆలౌట్ అయింది. 245 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కొరాపుట్ టీమ్ 20 ఓవర్లలో 155 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జయపురం జట్టు 89 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.



జయపురం, కొరాపుట్ జట్ల సభ్యులతో అతిథులు

క్లుప్తంగా

జమ్ముకాశ్మీర్‌పై విదర్భ విజయం



జమ్ము కాశ్మీర్-విదర్భ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న విజయ్ హజారే క్రికెట్ ట్రోఫీలో జమ్ముకశ్మీర్ జట్టుపై విదర్భ జట్టు విజయం సాధించింది. సోమవారం నగర శివారుల్లో గల విజ్జి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన విదర్భ జట్టు ముందుగా జమ్ముకశ్మీర్ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించగా..44.2 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటయ్యారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విదర్భ జట్టు 37.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు జోడించి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

లారీ బోల్తా



బైపాస్ రోడ్డు సమీపంలో బోల్తాపడిన లోడు లారీ

గజపతినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు కూడలి వద్ద సోమవారం ఉదయం ఓ లారీ బోల్తాపడింది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం వైపు నుంచి గజపతినగరం మీదుగా విజయనగరం వెళ్తున్న ఐరన్‌వోర్ లోడ్ లారీ అదుపు తప్పి గజపతినగరం మార్గ మధ్యంలో బోల్తా పడింది. బైపాస్ రోడ్డు పనుల్లో కానా నిర్మించి పూర్తి స్థాయిలో మట్టి వేయకపోవడం వల్ల వేసిన మట్టి వర్షాలకు కరిగి పోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో లోడుతో ప్రయాణిస్తున్న లారీ కానా కింద లోయలో పడి కూరుకుపోయింది. ఆ సమయంలో జనసంచారం తక్కువగా ఉండడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

రెండు ఆటోలు ఢీ

• పలువురికి గాయాలు

రామభద్రపురం: మండలకేంద్రం నుంచి బొబ్బిలి వెళ్లే రహదారిలోని మహీంద్రా షోరూం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీ కొనగా అందులో ఒక ఆటో రోడ్డుపై బోల్తాపడగా పలువురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావివలస గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు క్రిస్మస్ పండగ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ఆటోలో సామగ్రి కొనుగోలు చేసేందుకు బొబ్బిలి వెళ్లారు. సామగ్రి కొనుగోలు చేసి తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా రామభద్రపురం సమీపంలోని మహీంద్రా షోరూం వద్దకు వచ్చేసరికి మండలకేంద్రం నుంచి బొబ్బిలి వెళ్తున్న మరో ఆటో ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో బొబ్బిలి నుంచి గిరిజనులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడగా ఆటోలో ఉన్న గొర్లదురు జమున్నమ్మ, ఆమె కుమార్తెలు దివ్య, శైలజతో పాటు గొర్లదురు సీతమ్మ, దుంబిరి సత్యవతి, ఆటో డ్రైవర్ గొర్లదురు సీతయ్య, సీతానగరం మండలం రామవరం గ్రామానికి చెందిన గర్భాపు సింహాచలం, బొబ్బిలి మండలం రాజుపేట గ్రామానికి చెందిన దారపురెడ్డి అచ్చియ్యమ్మ, కోరెడ్ల మంగమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. అలాగే మరో ఆటో డ్రైవర్ కంబాపు రాంబాబు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం మేరకు పోలీసులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం అవే ఆటోల్లో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వారందరికీ వైద్యాధికారి దిలీప్‌కుమార్ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఎస్సై విప్రసాదరావు పరిశీలించి మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రులను స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్సై ఐవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న విజయవాడలో వాలీబాల్ జట్టు ఎంపికలు

• జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సీనియర్స్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే స్త్రీ, పురుషుల రాష్ట్ర జట్ల ఎంపికలు ఈనెల 27న విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఆ రోజు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 7 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరగనున్న సీనియర్స్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని మరిన్ని వివరాలకు ఫోన్ 94917 67327, 8074116276 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కార దిశగా చర్యలు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పీజీఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి



సమస్యలను వింటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

పార్వతీపురం: సమస్యలను సావధానంగా విని, తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 149మంది నుంచి కలెక్టర్‌తోపాటు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్ఓ కె.హేమలతలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం లభించాలని, ఎట్టిపరిస్థితిలోను అర్జీలు పునఃప్రారంభం కారాదన్నారు.

పీజీఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్ ప్రారంభం

కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన పలువురు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో కొత్తగా పీజీఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. ఇక్కడ అర్జీలను ఇవ్వడానికి వచ్చే ప్రజలకు తాగునీటి సదుపాయం, టీ ఇచ్చే ఏర్పాటుచేసినట్లు చెప్పారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలతో బాగా మమేకమై బాగా పనిచేసిన అధికారులను గుర్తించి చిన్న జ్ఞాపికతో ప్రతి సోమవారం సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా, డీఆర్డీఏ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యం నాయుడు, జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా పశు వైద్య శాఖాధికారి డా.ఎస్.మన్మథరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, ఎల్‌డీఎం జీఎల్ ఎన్.మూర్తి, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్ రావు, ఇతర అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: పీజీఆర్ఎస్ ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబకలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీ, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లతై చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సై ఫకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వినతులను అప్‌లోడ్ చేసే సిబ్బందికి శిక్షణ

విజయనగరం అర్బన్: ప్రజల నుంచి వచ్చే అర్జీలను అప్‌లోడ్ చేసే సిబ్బందికి కలెక్టరేట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ తెలిపారు. ప్రతి కార్యాలయంలో అప్‌లోడ్ చేసే కంప్యూటర్ ఆపరేటర్ పేరు, ఫోన్ నంబర్‌ను సోమవారం సాయంత్రంలోగా కలెక్టరేట్‌కు సమర్పించాలని వారందరికీ అర్జీలను ఎలా అప్‌లోడ్ చేయాలి, చెక్‌లిస్టు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్జీలకు అధికారులు నాణ్యమైన సమాధానాలు ఇచ్చేలా పర్యవేక్షించేందుకు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, సెర్ప్, వైద్యారోగ్యం, పౌర సరఫరాలు తదితర 13 శాఖలకు సంబంధించి ఆడిట్ అధికారుల బృందాలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ బృందం ఆయా శాఖలకు వచ్చే ప్రతి అర్జీని ట్రాక్ చేయడం, అర్జీ డిస్పోజ్ అయ్యే వరకూ పర్యవేక్షించడం చేస్తుందన్నారు. తప్పుడు సమాధానాలు ఇవ్వకుండా తనిఖీ చేయడం, తప్పుడు ఎండార్స్ మెంట్ వేస్తే రీ ఓపెన్ చేసి తిరిగి ఆ శాఖకు పంపడం, అర్జీదారు సంతృప్తి చెందేలా సమాధానాలు ఇవ్వడంలో సహకరించడం, సలహాలు ఇవ్వడం వంటి విధులు చేయాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 140 వినతులను కలెక్టర్ అంబేడ్కర్ స్వీకరించారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు

• జేసీ శోభిక హెచ్చరిక



మాట్లాడుతున్న జేసీ శోభిక

సీతంపేట: ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆమె సీతంపేట ఐటీడీఏలో తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తూకాలు, కొలతల్లో ఎటువంటి మోసాలు లేకుండా చూడాలని, రైతుల నుంచి ఎటువంటి నగదు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతుకు సన్మానం



మహిళా రైతు పల్ల శంకరమ్మను సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా గడిచిన ఎనిమిదేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరిస్తున్న గుమ్మలక్ష్మీపురం మండలం వంజరాపుగూడ గ్రామానికి చెందిన పల్ల శంకరమ్మను ప్రకృతి వ్యవసాయ విభాగం సన్మానించింది. ఆమె తనకున్న రెండు ఎకరాల భూమిలో 365 రోజుల పాటు వివిధ పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తుండడంతో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు, సిబ్బంది జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ వద్ద విద్యార్థుల సమక్షంలో సోమవారం సన్మానించారు. ఈ మేరకు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడులు తగ్గుతాయని, నేల సారవంతం అవుతుందని, ఆరోగ్యకరమైన పంటలు పండి, రైతుకు ఆదాయం దండిగా లభిస్తుందన్నారు. కావున ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసేలా విద్యార్థులు అవగాహన కలిగి ఉండి గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఎంఎంటీఎల్ వై.గణేష్ శరత్ చంద్ర, ఎంటీలు జి.నిర్మలా దేవి, ఎల్.నరసింహ, సిబ్బంది టి.రవి, పి.ప్రసాద్, మిన్నారావు, కె.భూషణ్ తదితరులు ఉన్నారు.

జంఝావతి కన్నీటియాత్ర



జంఝావతి కన్నీటి యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

• జంఝావతిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని డిమాండ్

పార్వతీపురం టౌన్: జంఝావతి ప్రాజెక్టుపై పాలకులు శీతకన్నువేశారు.. ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు.. తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి.. ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తినాయుడు డిమాండ్ చేశారు. ప్రాజెక్టుపై పాలకుల తీరుకు నిరసనగా పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామ సమీపంలో సోమవారం 'జంఝావతి కన్నీటియాత్ర'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా వివాదం నెపంతో ప్రాజెక్టు పనులను నిలిపివేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వమే రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నందున జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రి స్పందించి జంఝావతి రైతుల కన్నీటిని తుడవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం తలచుకుంటే ఒడిశా వివాదం పరిష్కారమవుతుందన్నారు. జంఝావతిని సాధించేందుకు ఓ సాధన కమిటీని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాగారపు ఈశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహచక్రవర్తి, బీజేపీ నాయకుడు మరిశర్ల రామారావు, ప్రత్యేక సలహాదారు శివకృష్ణ, విజయనగరం, విశాఖపట్నం సమితి జిల్లా అధ్యక్షుడు ఐ.గోపాలరావు, దేవుపల్లి సత్యారావు పట్నాయక్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భారతానంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 17 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి ప్రజల నుంచి 17 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలపై నివేదికలను తనకు అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.శంకరరావు, ఎస్పీ సీసీ ఎ.లీలారావు, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పాలకొండ రోడ్డులో గుర్తుతెలియని సుమారు 70 సంవత్సరాలు కలిగిన వృద్ధుడి మృతిపై కేసు నమోదు చేసినట్లు సంతకవిటి ఏఎస్సై ఎం.వాసుదేవరావు సోమవారం తెలిపారు. గత ఐదారు సంవత్సరాలుగా యాచక వృత్తిచేసుకుంటూ జీఎంఆర్ గేటు ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్‌లో తలదాచుకుంటూ జీవనం సాగిస్తుండేవాడన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా బస్‌షెల్టర్ తొలగించడంతో రోడ్డుపక్కనే ఉండేవాడని దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు అనారోగ్యం బారిన పడి మృతిచెంది ఉంటాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు ఈ నెల 22న సాయంత్రం పొనుగుటివలస వీఆర్వో ఎం.రోజారమణికి సమాచారం అందించడంతో ఆమె ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు కేసు నమోదుచేశామని ఏఎస్సై తెలిపారు.

డీలర్ల ఎంపికకు పరీక్ష నిర్వహణ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం డివిజన్‌లో చౌకదారుల దుకాణాల డీలర్ల ఎంపికకు రాతపరీక్షను సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షలను నిర్వహించగా పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. డివిజన్‌లో 36 చౌకదారుల దుకాణ డీలర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ ఆధారంగా 285 దరఖాస్తులు అందాయి. వాటిలో 63తిరస్కరణకు గురికాగా, 222దరఖాస్తులను అంగీకరించారు. రాత పరీక్షలకు 202 మంది హాజరు కాగా 20మంది గైర్హాజరయ్యారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



ర్యాలీలో పాల్గొన్న చిత్రకొండ ఎమ్మెల్యే, నాయకులు



వినతిపత్రంతో కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు

మల్కన్‌గిరి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు అందజేయాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పార్టీ నాయకులతో కలిసి చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రంల అందజేశారు. పార్టీ జిల్లా ప్రెసిడెంట్ గోవిందపాత్రో, జి.శ్రీనివాస్‌రావు, పి.కేసురావు, మాల్ల మాడీ, పార్టీ కర్యకర్తలు పాల్గొన్నారు.

బాలాసోర్ ఎంపీపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న యువజన కాంగ్రెస్ నేతలు

భువనేశ్వర్: బాలాసోర్ లోక్‌సభ సభ్యుడు ప్రతాప్ చంద్ర షడంగికి వ్యతిరేకంగా స్థానిక క్యాపిటల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. భారత పార్లమెంటు ప్రాంగణంలో ఎంపీల తోపులాటలో జారి పడిన ప్రతాప్ చంద్ర షడంగి స్వల్పంగా గాయపడి రాహుల్ గాంధీపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని, ఈ మేరకు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజన, విద్యార్థి కాంగ్రెస్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



బస్సు సీట్ల మధ్య ఇరుక్కుని నరకయాతన పడుతున్న మహాలక్ష్మి

• బస్సును వెనుక నుంచి మరో లారీ ఢీ
• పలువురు ప్రయాణికులకు తీవ్రగాయాలు



బస్సు,లారీ ఢీ కొట్టిన దృశ్యం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట ముచ్చర్లవలస గ్రామాల మధ్యలో ఉన్న రాజస్తానీ దాబా వద్ద జాతీయ రహదారిపై సోమవారం లారీలు, బస్సు ఢీకొనడంతో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికుల్లో ఒకరైన బొండపల్లి మండలంలోని గరుడబిల్లికి చెందిన రెడ్డి మహాలక్ష్మి రెండు కాళ్లు రెండు సీట్ల మధ్య ఇరుక్కోవడంతో గంటన్నర పాటు నరకయాతన పడింది. సమాచారం మేరకు వచ్చిన పోలీసులు, స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. నుజ్జునుజ్జయిన బస్సు సీట్లను జేసీబీ సహాయంతో లాగి సీట్ల మధ్య ఇరుకున్న మహిళ కాళ్లను తీశారు. ఎస్సై వి.ప్రసాదరావు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆటోలో స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అదే బస్సులో బొబ్బిలి వెళ్తున్న ఆరికతోట గ్రామానికి చెందిన సురగాల సౌజన్య గాయపడి బొబ్బిలి సీహెచ్‌సీలో చికిత్స పొందుతుండగా విజయగనగరానికి చెందిన చిన్నారి పి.ప్రసన్నశ్రీ స్థానిక క్వీన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటనలో పెనుప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తహసీల్దార్ సులోచనరాణి, ఎస్సై వి.ప్రసాదరావులతో కలిసి ఆర్డీవో రామ్మోహనరావు సంఘటన స్థలంతో పాటు క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

ప్రమాదం జరిగిందిలా..

విజయనగరం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు విజయనగరం నుంచి పార్వతీపురం 45 మంది ప్రయాణికులతో వెళ్తోంది. సరిగ్గా ఆరికతోట సమీపంలో రాజస్థానీ దాబా వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ సిగ్నల్ లైట్లు వేయకుండా నెమ్మదించింది. అదే సమయంలో ముందున్న వాహనానికి 50 అడుగుల దూరం ఉండాలన్న నిబంధన పాటించకుండా వెనుక నుంచి వస్తున్న బస్సు ఆ లారీని బలంగా ఢీకొట్టింది. అదే రూట్‌లో బస్సు వెనుక వస్తున్న మరో లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టింది. దీంతో బస్సులో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. ప్రమాదంలో బస్సుతో పాటు రెండు లారీలది తప్పేనని, మూడు వాహనాలను సీజ్ చేసి ఆయా డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామని ఎస్సై వి.ప్రసాదరావు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర, (వెనుక ముసుగులో నిందితుడు)

రాజాం సిటీ: ఓ యువకుడిని వ్యసనాలు దొంగగా మార్చాయి. ఈ క్రమంలో ఏడాది నుంచి తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు ఒడిగడుతూ చివరికి పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యాడు. ఈ విషయానికి సంబంధించి రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలంలోని తునివాడ గ్రామానికి చెందిన వంజరాపు లలితమ్మ ఇంటికి తాళం వేసి విశాఖపట్నంలో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న బంగారపు గొలుసు చోరీ చేయగా ఆమె రేగిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై పి.నీలావతి కేసు నమోదుచేసి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అదే మండలం చిన్నయ్యపేట సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న పాలకొండ మండలం యరకారాయపురం గ్రామానికి చెందిన శ్రీరామ బాలరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ఇప్పటికే దేవుదల, కాగితాపల్లి గ్రామాలతో పాటు సంతకవిటి మండలంలోని కొండగూడెం గ్రామాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అనంతరం నిందితుడి నుంచి మొత్తం రూ.7.20 లక్షల విలువైన 90 గ్రాముల బంగారానికి సంబంధించి ఒక బంగారు హారం, ఒక బ్రాస్లెట్, రెండు చెవి దిద్దులు, రెండు బంగారు గొలుసులు, రెండు చెవిపోగులు, రూ.30వేల విలువైన 30 తులాల రెండు వెండిపట్టీలతో పాటు రూ.5వేల నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని సీఐ ఉపేంద్ర వివరించారు. కార్యక్రమంలో రేగిడి ఎస్సై పి.నీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.